చిన్నారికి మాజీ ఎంఎల్‌ఎ తలారి పరామర్శ

ప్రజాశక్తి - తాళ్లపూడి

ప్రమాదవశాత్తు ఇంటి డాబాపై నుంచి పడిపోయి తీవ్ర గాయాలతో రాజమహేంద్రవరంలోని డెల్టా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తాళ్లపూడి గ్రామానికి చెందిన చిన్నారి పాటూరి తాప్సీని మాజీ ఎంఎల్‌ఎ, వైసిపి కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి తలారి వెంకట్రావు శనివారం పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి పాప పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాప కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయాన్ని అందించారు..

సమస్యల్లో అతిథి అధ్యాపకులు

- నేటికీ అరకొర జీతాలే శరణ్యం
- ఉద్యోగ భద్రత లేక ఆందోళన
- ఆర్థిక ఇబ్బందులతో సతమతం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పదేళ్లుగా పని చేస్తున్నా రూ.10 వేలు మించి వేతనం రావడం లేదని పలువురు అతిథి అధ్యాపకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధరలు ఆకాశాన్నంటుతున్నా తమ వేతనాల్లో దశాబ్ద కాలంగా ఎటువంటి మార్పు లేదని ఆవేదన చెందుతున్నారు. శ్రమకు తగిన ఫలితం దక్కక అనేక అవస్థలు పడుతున్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, గెస్ట్ అధ్యాపకుల సమస్యలపై నిరంతరం పనిచేస్తున్న పిడిఎఫ్ ఎంఎల్‌సిలు మాత్రమే తమ సమస్యలపై గళం విప్పుతున్నారన్నారు. దీనిపై అధికార పార్టీ ఎంఎల్‌ఎలూ స్పందించాలని వారు కోరుతున్నారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 100 మంది, డిగ్రీ కాలేజీల్లో 230 మంది, ఎపి సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలల్లో 170 మంది అతిథి అధ్యాపకులు (గెస్ట్ లెక్చరర్లు) పని చేస్తున్నారు. కళాశాలల్లో అధ్యాపకుల కొరత కారణంగా 2014లో ప్రభుత్వం వీరిని నియమించింది. జూనియర్ కళాశాలల వారికి గంటకు రూ.150, డిగ్రీ వాళ్లకు రూ.200, గురుకుల పాఠశాలల్లో టిజిటిలకు రూ.141, పిజిటిలకు గంటకు రూ.161 వంతున రోజుకు ఎన్ని గంటలు బోధిస్తే అన్ని గంటల వంతున లెక్కించి గౌరవ వేతనంగా ప్రభుత్వం చెల్లిస్తోంది. ఒక్కొక్కరు నెలకు సగటున 120 నుంచి 130 గంటలు బోధిస్తున్నారు. అయితే నెల వేతనానికి పరిమితి విధించడంతో ఎన్ని ఎక్కువ గంటలు పని చేసినా పరిమిత వేతనం చెల్లించేలా నిబంధనలు విధించారు. ఆరు నెలల కితం ప్రభుత్వం డిగ్రీ, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పని చేస్తున్న వారికి వేతనాలు పెంచి అమలు చేసింది. కాని జూనియర్ కాలేజీల్లో పని చేస్తున్న వారిని మాత్రం గాలికొదిలేసింది.

రూ.10 వేలు వేతనంతో సరి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంట్రాక్ట్ వ్యవస్థని 2012లో అప్పటి ప్రభుత్వం నిలిపేసింది. ఆ సమయంలో ఇంటర్మీడియట్ వ్యవస్థలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకుండా అప్పటి టిడిపి ప్రభుత్వం ఈ గెస్ట్ ఫ్యాకల్టీ వ్యవస్థను తెరపైకి తెచ్చింది. విభజన అనంతరం తెలంగాణలో ఇంటర్మీడియట్ వ్యవస్థలో పనిచేసే అతిథి అధ్యాపకులకు రూ.10 వేల నుంచి వేతనాన్ని రూ.21,600కి పెంచింది. ఆ తర్వాత కాలంలో మరోసారి దీన్ని రూ.28 వేలకు పెంచింది. కాని ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం అతిథి అధ్యాపక వ్యవస్థ కొనసాగుతున్నా నాటి నుంచి నేటి వరకూ రూ.10 వేలు మాత్రమే వేతనంగా ఇస్తుంది. ఇంటర్మీడియట్ వ్యవస్థలో పనిచేసే గెస్ట్ ఫ్యాకల్టీల విషయంలో జీతాల చెల్లింపుల్లో భారీ వ్యత్యాసం కన్పిస్తోంది. జూనియర్ కళాశాలల్లో పనిచేసే అతిథి అధ్యాపకులకు రూ.10 వేలతో సరిపెడితే ఇదే వ్యవస్థలో ఉన్న బిసి వెల్ఫేర్‌లో టిజిటిలకు రూ.19 వేలు, పిజిటిలకు రూ.24 వేలు, సోషల్ వెల్ఫేర్ టిజిటిలకు రూ.19,350, పిజిటిలకు రూ.24,100, జెఎల్‌లకు రూ.26 వేలు ఇస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేసే వారికి మాత్రం రూ.57,100, పార్ట్ టైం అధ్యాపకులకు రూ.37,100, ఎంటిఎస్‌లకు రూ.57,100తో బాటు డిఎను కూడా ఇస్తున్నారు. జూనియర్ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్లకు మాత్రం పదేళ్ల క్రితం నాటి పద్ధతినే అవలంబిస్తూ గంటల ప్రాతిపదికన రూ.10వేలు మించకుండా వేతనం ఇస్తున్నారు. ఒకే వ్యవస్థలో విద్యా అర్హతలు, పనిచేసే విధానంలో సమానంగా ఉన్నప్పటికీ వేతనంలో వ్యత్యాసాలు ఉండటంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

సుప్రీంకోర్టు చెప్పినా...

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు ఆదేశాలిచ్చినా ఇక్కడ ఇంటర్మీడియట్ వ్యవస్థలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులకు మాత్రం కనీస వేతనం ఇవ్వకపోవడం శోచనీయమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో పలువురికి వేతనాలు పెంచినా తమకు మాత్రం పెంచకుండా అన్యాయం చేసిందని విమర్శిస్తున్నారు. ఏ రోజుకైనా తమ జీవితాలను బాగు చేస్తుందని ఆశా భావంతో పని చేస్తున్నారు. ప్రస్తుత జీవన ప్రమాణాలను దృష్టిలో ఉంచుకుని తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

పెరుగుతున్న ధరలతో ఇబ్బందులు

ప్రభుత్వం జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న గెస్ట్ అధ్యాపకుల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తుంది. అన్ని రకాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. పదేళ్లలో ధరలు పదిరెట్లకుపైగా పెరిగాయి. గ్యాస్, పెట్రోలు, కరెంటు ఛార్జీలు, ఆర్‌టిసి బస్సు ఛార్జీలు అదనం. ఈ నేపథ్యంలో గెస్ట్ లెక్చరర్లకు ప్రస్తుతం ఇస్తున్న వేతనానికి, పెరిగిన ధరలతో ఏమాత్రం సంబంధం లేకుండా ఉంది. దీంతో కుటుంబ పోషణ భారమైంది. ప్రభుత్వం ఇచ్చే రూ.10వేలు ఇంటి అద్దెలు, కరెంటు, ఇతర బిల్లులకే సరిపోవడం లేదు. దీంతో అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల ధర్నా

మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని డిమాండ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

అంగన్‌వాడీ మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణం జిఒ ఇవ్వాలని కోరుతూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. అనంతరం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.మాణిక్యాంబ, వై.బేబీరాణి మాట్లాడారు. రాష్ట్రంలో పేద గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్‌వాడీ మినీ వర్కర్స్ అనేక సేవలు అందిస్తున్నారన్నారు. అంగన్‌వాడీ సెంటర్ నిర్వహణకు వర్కర్ పని, హెల్పర్ పని మినీ సెంటర్స్‌లో ఒక్కరే చేయడం వల్ల పనిభారం పెరుగుతుందన్నారు. మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని జిఒ ఉన్నా సక్రమంగా అమలు కావట్లేదన్నారు. అత్యవసర సమయాల్లో, వేసవి కాలంలో మినీ వర్కర్లకు ఎటువంటి సెలవులు ఇవ్వడం లేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు అమలు చేయడం లేదన్నారు. మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా మార్చాలని, ఇతర సమస్యలు పరిష్కారం చేయాలని 42 రోజుల పాటు గతంలో సమ్మె చేశామన్నారు. ఈ సందర్భంగా మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా మార్చేందుకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు. ఈ మేరకు సర్వే కూడా చేశారని గుర్తు చేశారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం మినీ సెంటర్లను వెంటనే మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జిఒ ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ఎస్.మూర్తి, బి.పవన్, యువజన సంఘం జిల్లా కన్వీనర్ వి.రాంబాబు ధర్నాకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న మినీ వర్కర్లు, యూనియన్ నాయకులు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు మినీ వర్కర్లు జి.నాగజ్యోతి, ఆర్.అరుణకుమారి, పి.లలితకుమారి, ఎ.పార్వతి, సిహెచ్.అన్నపూర్ణ, మాలతి, రామలక్ష్మి, టిపి.లక్ష్మి, మార్తమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి - చాగల్లు

అండర్-19 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు చాగల్లు జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థిని రోజా ప్రవల్లిక అత్యుత్తమ ప్రతిభ కనబర్చింది. ఈ నెల 11న విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ఆమె రజత పతకం సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థినిని, శిక్షణ ఇచ్చిన ప్రేమ్‌చంద్రను పాఠశాల హెచ్‌ఎం వీర్రాజు అభినందించారు. అలాగే పీడీ విజయలక్ష్మి, ఉపాధ్యా సిబ్బంది, విద్యా కమిటీ చైర్మన్ గోపాలకృష్ణ అభినందించారు

శివాలయంలో మంత్రి పూజలు

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని అన్నవరప్పాడు జాతీయ రహదారి పక్కన వెంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో ఉన్న శివాలయాన్ని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శనివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్క గ్రామాల ప్రజలు స్ఫటికలింగ ఆకారంలో ఉన్న స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లూ చేశామని దేవస్థానం నిర్మాణ కర్త బొలిశెట్టి రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అర్చకులు ఫణి శర్మ తదితరులు పాల్గొనారు.

జ్యూట్ బ్యాగుల తయారీపై ఉచిత శిక్షణ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జ్యూట్ బ్యాగుల తయారీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ తాడి శ్రీనివాస్ తెలిపారు. స్థానిక అల్కట్ గార్డెన్స్‌లో ఉన్న కార్యాలయంలో ఈనెల 20 నుంచి ఈ శిక్షణా కార్యక్రమాలను ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ శిక్షణకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన వారు అర్హులన్నారు. 18 ఏళ్ల నుంచి 45 ఏళ్ల వయస్సు కలిగి ఉండాలన్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగి కనీసం 8వ తరగతి చదివి ఉండాలన్నారు. శిక్షణా కాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 0883-242024, 2428807, 9701359954, 9014328803 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కార్టూ'నిజం'



గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర ప్రశాంతి

కలెక్టరేట్ సమావేశ మందిరంలో గోదావరి పుష్కరాల ముందస్తు ఏర్పాట్లపై శనివారం కలెక్టర్ పి.ప్రశాంతి సమీక్షా సమావేశం నిర్వహించారు. సంబంధిత కమిటీలు చేపట్టాల్సిన కార్యాచరణపై జెసి చిన్నరాముడు, మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్, డిఆర్‌ఒ సీతారామమూర్తితో కలసి కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2027 గోదావరి పుష్కరాలకు సంబంధించి శాఖల వారీగా చేపట్టే పనుల ప్రాధాన్యతా క్రమంలో సంబంధించి ఒక్కొక్క కమిటీని నియమిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ట్రాఫిక్, హెల్త్ అండ్ శానిటేషన్, హెల్త్, ఫుడ్ కమిటీ, సర్వేలెన్స్ కమిటీ, పబ్లిక్ ట్రాన్స్పోర్ట్, పుష్కర్ నగర్ కమిటీ, డిజాస్టర్ కమిటీ, ఎన్‌జిఒ, పర్యాటక సాంస్కృతిక కమిటీ, ప్రొటోకాల్, ఎగ్జిబిషన్, చైల్డ్ అండ్ లేబర్ కమిటి, టెలి కమ్యూనికేషన్ కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా కమిటీలు చేపట్టే ముందస్తు కార్యాచరణ ప్రణాళికను సమగ్రంగా సిద్ధం చేయాలని ఆదేశించారు.

రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో మున్సిపల్ కార్పొరేషన్, కొవ్వూరు, నిడదవోలు మున్సిపాలిటీల పరిధిలో మున్సిపల్ శాఖల అధికారులు, కొవ్వూరు, రాజమహేంద్రవరం ఆర్‌డిఒలు రూరల్ ప్రాంతాల్లో చేపట్టాల్సిన అంశాలపై ప్రెజెంటేషన్ సిద్ధం చేయాలన్నారు. గత పుష్కరాలు కంటే పాపులేషన్, ట్రాఫిక్, వాహనాలు పెద్ద ఎత్తున పెరిగాయన్నారు. అందుకు తగ్గట్టుగా ట్రాఫిక్, రైల్వే, బస్సు ప్రయాణికులు, అంతర్గత రహదారులు పుష్కరాలకు వచ్చే యాత్రికులను దృష్టిలో పెట్టుకొని కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. హెల్త్ అండ్ శానిటేషన్ కమిటీ 24/7 శానిటేషన్ నిర్వహించేలా యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేయాలన్నారు. ఇతర ప్రాంతాలు నుంచి వచ్చే వారికి వసతి, ఆహారం ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. హెల్త్ కమిటీ పుష్కర్ ఘాట్స్‌లో నోడల్ పాయింట్స్ ఏర్పాటు చేయాలన్నారు. పిహెచ్‌సి వైద్యులు, అంబులెన్సులు, అత్యవసర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఏర్పాటు, చూడాలన్నారు. సర్వేలెన్సు కమిటీ చిన్నారులు, వృద్ధులకు సంబంధించిన సమాచారం, కావాల్సిన సిసి కెమెరాలు, ఏప్రాంతంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలనే అంశాలను రూపొందించాలన్నారు. పుష్కర ఘాట్లకు ఏ రూట్ లో ఎన్ని బస్సులు నడుపుతారు. ప్రస్తుతం ఎన్ని బస్సులు ఉన్నాయి. ఇంకా ఎన్ని బస్సులు అవసరం అవుతాయనే కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. పర్యాటక సాంస్కృతిక కమిటీ ద్వారా బటర్ ఫ్లై గార్డెన్స్, టెంపుల్ టూరిజం, సాంస్కృతిక కార్యక్రమాలపై దృష్టి పెట్టాలన్నారు. పుష్కర ఘాట్‌లలో ఆర్ అండ్ బి చేపట్టే అభివృద్ధి పనులు, పకృతి విపత్తుల కమిటీ చేపట్టే పనులు, ఎన్‌జిఒస్ కమిటీ కమిటీ, ప్రొటోకాల్, ఎగ్జిబిషన్, చైల్డ్ లేబర్, మొబైల్ హాస్పిటల్, టెలి కమ్యూనికేషన్, ఆర్ అండ్ బి పంచాయతీరాజ్ నేషనల్ హైవే కమిటీలు చేపట్టే పనుల వివరాలను రూపొందించాలన్నారు. జాతీయ రహదారులపై చేపట్టే ఫ్లైఓవర్, బ్రిడ్జిల నిర్మాణ పనులను ఆగష్టు 2027 పుష్కరాలు నాటికి పూర్తి అయ్యేలా చూడాలన్నారు ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్, అడిషనల్ ఎస్‌పి ఎవి.సుబ్బారావు, డిటిఒ ఆర్.సురేష్, ట్రాఫిక్ డిఎస్‌పి ఎం.వెంకటేశ్వర్లు, కొవ్వూరు ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ కెఎల్.శివజ్యోతి, రాజమండ్రి ఆర్‌డిఒ ఆర్.కృష్ణనాయక్, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

'తొర్రిగడ్డ'కు నిధులు కేటాయించాలి

రాజానగరం ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణ

ప్రజాశక్తి - సీతానగరం

తొర్రిగడ్డ రివర్స్ పంపింగ్ స్కీమ్‌కు తిరిగి నిధులు కేటాయించాలని రాజానగరం ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణ శనివారం అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు కోసం పలు అంశాలను ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. రాజానగరం నియోజకవర్గంలో కీలకమైన తొర్రిగడ్డ రివర్స్ పంపింగ్ స్కీమ్‌కు గత ప్రభుత్వంలో నిధులు కేటాయించారన్నారు. కాని ఒక రూపాయి కూడా ఖర్చు చేయలేదని తెలిపారు. దీంతో నిధులు రద్దయ్యాయన్నారు. ఎగువ కురిసిన వర్షాలు వల్ల సీతానగరం, కోరుకొండ మండలాల్లో ముంపునకు గురవుతున్న 25 వేల ఎకరాల పంట పొలాలను గట్టెక్కించడానికి రివర్స్ పంపింగ్ స్కీం ఒకటే మార్గమన్నారు. అందుకు అవసరమైన ప్రక్రియ నిరంతరంగా కొనసాగించాలని తెలిపారు. ఈ పంపింగ్ స్కీమ్‌కు తిరిగి నిధులు కేటాయించాలన్నారు. అలాగే మిర్తిపాడు బొబ్బిల్లంక, ములకల్లంక బ్రిడ్జిలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తగిన చొరవ తీసుకొని బత్తుల కోరారు.

జాతీయ సదస్సులో విజేస్ ప్రతిభ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

బహుమతులు అందుకుంటున్న విజేస్ ప్రిన్సిపల్

ఆదిత్య కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి సదస్సులో స్థానిక దివాన్ చెరువు విజేస్ ఫార్మసీ కళాశాలకు బహుమతులు లభించాయి. కంప్యూటేషనల్ అడ్వాన్స్‌మెంట్ ఇన్ రీసెర్చ్, ఎడ్యుకేషన్ ఫర్ ఫార్మాస్యూటికల్ ఎక్సలెన్స్ (కేర్ -2024) అనే అంశంపై పోస్టర్, ఓరల్ ప్రెజెంటేషన్ పోటీల్లో విజేస్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.నరేంద్రకు కేర్ మేస్ట్రో అవార్డును బహూకరించారు. కళాశాల అధ్యాపకురాలు కె.వి.నాగలక్ష్మి ఓరల్ ప్రెజెంటేషన్‌లో ప్రథమ బహుమతి సాధించారు. సుమారు 2000 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలలో విజేస్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు బహుమతులు గెలుపొందారు. ఫార్మ్-డి ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎం.పుష్పలత, జి.అమూల్యకు పోస్టర్ ప్రెజెంటేషన్‌లో బహుమతులు లభించాయి. ఫార్మా-డి రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఎస్.మేఘనకు కన్సొలేషన్ బహుమతలి లభించింది. బి.ఫార్మసీ మూడవ సంవత్సరం చదువుతున్న ఎమ్‌డి.రవూఫ్ పోస్టర్ ప్రెసెంటేషన్‌లో తతీయ బహుమతి, జి.దుర్గాప్రసాద్‌కు లఘు చిత్ర ప్రదర్శనలో మూడవ బహుమతి లభించింది. ప్రిన్సిపాల్ డాక్టర్.డి.నరేంద్ర, కరెస్పాండెంట్ డాక్టర్ ఎన్‌వివి.జగన్మోహన్‌రెడ్డి జ్ఞాపిక బాహూకరించి ఘనంగా సత్కరించారు.

రీసర్వేను రద్దు చేయండి

ప్రజాశక్తి- కోకుకొండ

గత ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వేను రద్దు చేసి పాత సర్వే నెంబర్లను రెవెన్యూ వెబ్ ల్యాండ్‌లో పొందుపర్చాలని రైతులు ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని నరసాపురంలో శనివారం రెవెన్యూ గ్రామ సభ జరిగింది. రీసర్వే జరిగిన భూములకు సంబంధించి రైతుల భూములకు విస్తీర్ణంలో తేడాలు ఉన్నాయని అధికారులకు గ్రామస్తులు ఈ సభలో ఫిర్యాదు చేశారు. కొంత మంది రైతులకు విస్తీర్ణం ఎక్కువగా, మరికొందరికి తక్కువగా నమోదైందన్నారు. మార్చి ముందు రిజిస్ట్రేషన్లు అయిన భూములకు రెవెన్యూ రికార్డు ఆన్‌లైన్‌లో 1బి(ఆర్వోఆర్) రావడం లేదని తెలిపారు. గత ఆగష్టు నుంచి రిజిస్ట్రేషన్లు జరిగిన భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు రావడం లేదని తెలిపారు. దస్తావేజుల ప్రకారం ఉన్న భూముల విస్తీర్ణం కాకుండా రీసర్వేతో ఇచ్చిన విస్తీర్ణానికి రిజిస్ట్రేషన్లు జరగడం వల్ల రైతుల తమ భూములను కోల్పోతున్నారన్నారు. రీసర్వే ప్రకారం రైతుకు ఉన్న భూమిలో కొంత భాగం అమ్ముకోవడానికి కాని, తన సంతతి వారికి గిఫ్ట్ రూపంలో రిజిస్ట్రేషన్లు చేయడానికి సమస్యలు వస్తున్నాయన్నారు. రీసర్వేకు ముందు ఉన్న సర్వే నెంబర్లను ఉంచి, రీసర్వేను రద్దు చేయాలని ఎంపిటిసి సభ్యులు పీతా శ్రీను బాబు, పెదపాటి భీమరాజు, మర్ల సుబ్రహ్మణ్య కౌండిన్య, చొంగా శ్రీనివాసు, దాకారపు శ్రీను, మారిశెట్టి భీమరాజు తదితరులు రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందించారు.

నూతన విద్యుత్ స్తంభం ఏర్పాటు

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి- కడియం

స్తంభాన్ని ఏర్పాటు చేస్తున సిబ్బంది

కడియం భాస్కర్‌నగర్ ప్రాంతంలో రహదారి చెంతన ప్రమాద కరంగా మారిన విద్యుత్ స్తంభం స్థానంలో నూతన విద్యుత్ స్తంభాన్ని ఆ శాఖ సిబ్బంది శనివారం ఏర్పాటు చేవారు. 'పొంచి వున్న ప్రమాదం' శీర్షికన ఈ నెల 22న ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తకు విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. నూతన విద్యుత్ స్తంభం ఏర్పాటు చేశారు. గంటల వ్యవధిలోనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. కొన్ని రోజులుగా భయం వ్యక్తం చేసిన స్థానికులు అధికారుల చర్యలతో సంతోషం వ్యక్తం చేశారు. ప్రజాశక్తికి కృతజ్ఞతలు తెలిపారు.

పోషకాహారం సమపాళ్లలో అందించాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

రాష్ట్రీయ బాల స్వస్త కార్యక్రమం, స్క్రీనింగ్‌లో భాగంగా శనివారం ఉండ్రాజవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని అన్ని అంగన్‌వాడీ సెంటర్లను, నెంబర్-4 స్కూల్‌ను వైద్యాధికారి డాక్టర్ ఆర్ఎస్ఎస్‌వి.ప్రసాద్ శనివారం సందర్శించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలో చిన్నారులను పరిశీలించారు. ప్రతి ఒక్కరికీ పోషకాహారం సమపాళ్లలో అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. నెంబర్-4 స్కూల్లో పిల్లలను పరిశీలించి, ప్రతి విద్యార్థి ఎత్తుకు తగ్గ బరువు ఉండేలా చూడాలని, రక్త హీనత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్స్ కెడివిఎల్.కుమారి, ఆరోగ్య పర్యవేక్షకులు జిన్నూరి శ్రీనివాసు, కె.నాగమణి, ఆరోగ్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - నల్లజర్ల

అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించడం ద్వారా వ్యాధులను గుర్తించొచ్చని నల్లజర్ల ప్రభుత్వాసుపత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ తెల్లం గంగాధరరావు అన్నారు. నల్లజర్లలోని మండల పరిషత్ పాఠశాలలోని విద్యార్థులకు శనివారం వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు వైద్య పరీక్షలు నిర్వహించారు. బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష కార్యక్రమం ద్వారా 18 ఏళ్ల లోపు పిల్లల్లో రక్తహీనత, ఎత్తు, బరువు, కంటి పరీక్షలు, వినికిడి పరీక్షలతో పాటు మానసిక రుగ్మతలు వంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గంగాధర్ మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో ఎఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పి గురువారం, శనివారాల్లో పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. విద్యార్థులకు నిర్వహించే ఆరోగ్య పరీక్షల పూర్తి సమాచారాన్ని ప్రభుత్వం ప్రత్యేకించి పంపిణీ చేసే పుస్తక రూపంలోని హెల్త్ కార్డుల్లో నిక్షిప్తం చేస్తారన్నారు. విద్యార్థుల ఆరోగ్యానికి ఎంతగానో ఉపకరించే ఈ కార్యక్రమాన్ని వైద్య ఉద్యోగులు బాధ్యతాయితంగా నిర్వహించాలని డాక్టర్ గంగాధరరావు పేర్కొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయస్థాన ఆవరణలోని డిఎల్ఎస్ఎ కార్యాలయంలో 'పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిషేధ చట్టం-2013'పై న్యాయ విజ్ఞాన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి బి.పద్మ మాట్లాడారు. 'పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిషేధ చట్టం-2013' లోని వివిధ అంశాలను వివరించారు. లైంగిక వేధింపులు, అసభ్యకర కార్యకలాపాలకు పాల్పడితే చట్ట పరమైన చర్యలు తప్పవన్నారు. ప్రతి కార్యాలయంలో ఈ విషయాలపై చర్యలు తీసుకునేందుకు ఆ సంస్థకు సంబంధించిన అధికారులు, ఉద్యోగులు, తదితరులతో కూడిన 'అంతర్గత ఫిర్యాదుల కమిటీ' ఉంటుందని తెలిపారు. పని ప్రదేశాల్లో మహిళలకు ఎలాంటి లైంగిక వేధింపులు ఎదురైనా వెంటనే ఈ కమిటీ దృష్టికి తీసుకురావాలన్నారు. విచారణ జరిపిన తరువాత తగు రీతిలో చర్యలు కమిటీ తీసుకుంటుందని వివరించారు.

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్‌బాబు మాట్లాడుతూ సహ ఉద్యోగులతో సోదరభావంతో మెలగాలన్నారు. వారికి ఇబ్బందికర పరిస్థితులకు గురిచేయరాదన్నారు. పని ప్రదేశాలలో మహిళలతో మాత్రమే కాకుండా కార్యాలయాలకు వచ్చే వారితో కూడా గౌరవంగా వ్యవహరించాలని అన్నారు. ఈ సదస్సులో అసిస్టెంట్ కలెక్టర్ భావన, ఐసిడిఎస్ పీడీ కె.విజయ్ కుమారి, రెవెన్యూ సిబ్బంది, సిడిపిఒ నర్సమ్మ, సచివాలయం కార్యదర్శులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్

40 కాసుల బంగారం, రూ.2.70 లక్షల సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని సాగిపాడు గ్రామంలో ఈనెల 2న జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 40 కాసులు బంగారం, రూ.2.70 నగదును స్వాధీనం చేసుకున్నారు. గోపాలపురం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో దేవరపల్లి సిఐ బి.నాగేశ్వరనాయక్, ఎస్‌ఐ కె.సతీష్‌కుమార్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. మండలంలోని సాగిపాడు గ్రామంలో ఈనెల రెండవ తేదీ రాత్రి 7:50 గంటల ప్రాంతంలో ఇంటి యజమాని భమిడిపాటి శ్రీనివాస్ తన కూతుర్ని దించేందుకు హైదరాబాదుకు బస్సులో పయనమయ్యాడు. ఆ సమయంలో ఇంట్లో భమిడిపాటి శారద, ఆమె తల్లి గరిమెళ్ల సూర్యకాంతంఉన్నారు. ఇదే అదునుగా భావించిన ఇద్దరు వ్యక్తులు ముసుగులు ధరించి ఇనుప రాడ్లతో ఇంట్లోకి చొరబడ్డారు. అడ్డొచ్చిన తల్లీకూతళ్లపై రాడ్లతో దాడి చేశారు. వారిని కట్టిపడేసి రూ.3.50 లక్షల నగదు, 40 కాసులు బంగారు నగలు, వెండి వస్తువులను తీసుకుని పారిపోయారు. దీనిపై భమిడిపాటి శారద ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోపాలపురం పోలీసులు కేసు నమోదు చేశారు. దేవరపల్లి సిఐ బి.నాగేశ్వరనాయక్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టారు. కామవరపుకోట మండలం పాత కొండగూడెంకు చెందిన చీకట్ల సతీష్, రాజమహేంద్రవరం రూరల బొమ్మూరుకు చెందిన షేక్ అబ్దుల్ బాదుల్లా షరీఫ్, గోపాలపురం మండలం తొక్కిరెడ్డి గూడెంకు చెందిన నక్క కిషోర్‌బాబులను నిందితులుగా గుర్తించారు. వీరిలో షేక్ అబ్దుల్ బాదుల్లా షరీఫ్, నక్క కిషోర్‌బాబులను శుక్రవారం రాత్రి అరెస్టు చేశారు. చీకట్ల సతీష్‌ను జంగారెడ్డిగూడెం పోలీసులు వేరే కేసులో అరెస్టు చేసి జైలుకు పంపినట్లు తెలిపారు. వీరిని కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసిన సిఐ, ఎస్‌ఐ, సిబ్బందిని ఎస్‌పి అభినందించారు.

మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ముమ్మిడివరం

అప్పు ఇప్పించిన విషయంలో మధ్యవర్తిగా ఉన్న వ్యక్తి తీవ్ర మనస్తాపానికి గురై గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం. తిల్లమ్మ చెరువుకు చెందిన మెల్లం సాయిబాబు(33) ష్యూరిటీగా ఉండి తన స్నేహితుడికి రూ.15 లక్షలు అప్పు ఇప్పించాడు. అప్పు కట్టకపోవడంతో సాయిబాబుపై ఒత్తిడి పెరిందె.తనకు సంబంధం లేదని అప్పు తీసుకున్న వ్యక్తి నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. ఈ నెల 14వ తేదీ రాత్రి అప్పు తీసుకున్న వ్యక్తి ఇంటి వద్ద సాయిబాబు గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు .అపస్మారక స్థితిలో ఉన్న సాయిబాబును కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శనివారం మరణించాడు. ఈ మేరకు ఎస్‌ఐ డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేశారు.

గోదావరిలో మునిగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

గోదావరిలో స్నానానికి దిగిన వ్యక్తి ప్రమాదవశాత్తూ నీట మునిగి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇవి.. నగర పంచాయతీ పరిధిలోని క్రాప చింతలపూడికి చెందిన మాదాల వెంకటేశ్వరరావు(57) గురువారం మురమళ్లలో గోదావరి నదిలో స్నానానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తూ నీట మునిగి మృతి చెందాడు. అతని మృతదేహం శనివారం అన్నం పల్లి పంచాయతీ పరిధిలోని లక్ష్మీదేవి లంక వద్ద గోదావరిలో లభ్యమైంది. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ డి.జ్వాలాసాగర్ తెలిపారు.

మోటార్ సైకిల్ చోరీ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మోటార్ సైకిల్ చోరీ ఘటన పై బాధితుడు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ముమ్మిడివరం పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం నగర పంచాయతీకి చెందిన చెందిన టిడిపి నాయకుడు విళ్ళ వీరాస్వామి నాయుడు శుక్రవారం రాత్రి అన్నా క్యాంటీన్ వద్ద మోటార్ సైకిల్ పార్క్ చేసి లోపలికి వెళ్లాడు. ఆయన తిరిగి వచ్చేసరికి అతని మోటార్ సైకిల్ చోరీ కి గురైందని వీరాస్వామి నాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్‌ఐ డి జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ట్రావెల్స్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పెరవలి

ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో మండలంలో నల్లాకులవారిపాలెం గ్రామానికి చెందిన నల్లాకుల వెంకటనరసయ్య(48) మృతి చెందాడు. ఎస్‌ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపిన విరవాల మేరకు వెంకటనరసయ్య శనివారం ఉదయం 6 గంటల సమయంలో జాతీయ రహదారిపై టీ కొట్టు వద్దకు టీ తాగేందుకు నడుచుకుని వెళ్తున్నాడు. ఈ సమయంలో తణుకు వైపు నుంచి రావులపాలెం వైపు వెళ్తున్న ప్రయివేటు ట్రావెల్స్ బస్సు అతన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో నరసయ్య అక్కడిక్కడే మృతి చెందాడు. అతని భార్య కనకదుర్గ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు

ట్రాక్టర్ తిరగబడి వ్యక్తి మృతి

రౌతులపూడి : మండలంలోని బంగారియ్యపేట గ్రామంలో ఇటుకలబట్టిలో ట్రాక్టర్‌తో మట్టిని తొక్కుతుండగా ట్రాక్టర్ అదుపుతప్పి తిరగబడటంతో పబ్బిరెడ్డి శ్రీనుబాబు(38) శనివారం మృతి చెందాడు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ఇటుక బట్టి యజమాని డిబిడి.కృష్ణార్జున్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

2,400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

పెద్దాపురం : సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 2400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి అర్జునరావు తెలిపారు. మండలంలోని తిరుపతి, జగ్గంపేట మండలం మామిడాడ గ్రామాల్లో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో భాగంగా సారా కేసుల్లో 10 మంది పాత ముద్దాయిలను బైండోవర్ చేసి పెద్దాపురం తహశీల్దార్ కోర్టులో హాజరు పరిచామన్నారు.

ప్రజల ఆశలపై నీళ్లు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత న్విహిస్తున్న తొలి బడ్జెట్ సమావేశాలు జిల్లా వాసులను నిరాశ పరిచాయి. గత వైసిపి ప్రభుత్వం ఆర్థిక అరాచకాలకు పాల్పడిదంటూ 2024 ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు ఎండగట్టారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దుతామంటూ అనేక హామీలు గుప్పించిన విషయం విధితమే. సూపర్ సిక్స్ పథకాల పేరు చెప్పి ప్రజలను ఆశల పల్లకి ఎక్కించారు. తాజా బడ్జెట్‌లో ఆ పథకాలకూ నిధుల కేటాయింపులకు పొంతనే లేదంటూ విశ్లేషకులు విమర్శలు గుప్పించారు. ఆద్యంతం ఎంఎల్‌ఎలు తమ అధినేత ఘనతను కీర్తించడంతో పాటు గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించడం పరిపాటి గామారింది. వ్యవసాయం ప్రధాన ఆధారమైన ఈ జిల్లాలోని సాగునీటి వనరుల కోసం రూ.50 కోట్లు మాత్రమే కేటాయింపులు చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. గత ప్రభుత్వమూ రూ.80 కోట్లు కేటాయించిన విషయం విధితమే. ఆచరణలో కేటాయించిన నిధులు సైతం వెచ్చింకపోవటంతో కాల్వల పూడిక తీతలకు సైతం నోచుకోలేదు. ఆధునికీకరణ ఊసే లేదు. అదే విధంగా కోనసీమ రైల్వే లైన్‌కు సైతం నిరాశ తప్పలేదు. కీలకమైన కోటిపల్లి - నర్సాపురం రైల్వే లైను పూర్తి కావడం కోసం కోనసీమ ప్రజానీకం ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లేసింది. ప్రజల ఆకాంక్షలకు తగినట్లుగా ప్రభుత్వం స్పందించకపోతే గత ప్రభుత్వానికి పట్టిన దుస్థితి తప్పదనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది.

జోరుగా ప్రజాపోరు

పెరుగుతున్న అధిక ధరలకు వ్యతిరేకంగా, మహిళలు, బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలకు వ్యతిరేకంగానూ, జమిలి ఎన్నికలను నిరసిస్తూ సిపిఎం చేపట్టిన చేపట్టిన ప్రజాపోరు ఊపందుకుంది. ఈ వారంలో పట్టన కేంద్రాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములై పాలకులపై తమ నిరసనను వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలను నిర్వహించి పాలకుల వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు ప్రజల గొంతుకై సమస్యలను వెలుగెత్తేందుకు సిద్ధమైంది. ప్రజలు భాగస్వాములై తమ మద్దతు తెలుపుతున్నారు. మరోవైపు జమిలి ఎన్నికల పేరుతో రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేందుకు జరుగుతున్న ప్రయత్నాన్ని ప్రజలకు వివరిస్తూ ప్రజాపోరు ముందుకు సాగింది.

పిడిఎఫ్ అభ్యర్థి గోపిమూర్తి నామినేషన్‌కు బ్రహ్మరథం

ఉపాధ్యాయ ఎన్నికలలో పిడిఎఫ్ తరుపున పోటీ చేస్తున్న బొర్రా గోపి మూర్తి నామినేషన్‌కు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు బ్రహ్మరథం పట్టాయి. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలలో ఇప్పటివరకూ పిడిఎఫ్ విజయ ఢంకా మోగించిన విషయం విధితమే. గెలిచిన అనంతరమూ ఉపాధ్యాయులు, పట్టభద్రుల గళం శాసన మండలిలో విన్పించడంతో పాటు ప్రజా సమస్యలను పరిష్కార దిశగా విశేష కృషి చేశారు. ఈ ఒరవడికి కొనసాగించేందుకు పిడిఎఫ్ అభ్యర్థులు మరోసారి సమాయత్తం అయ్యారు. ఈ సందర్భంగా అభ్యర్థి గోపిమూర్తి కోసం భీమవరం నుంచి చేపట్టిన భారీ ర్యాలీ ఉమ్మడి జిల్ల కేంద్రమైన కాకినాడ కలెక్టరు కార్యాలయం వరకూ జరిగింది. 2017 నుంచి 13 మంది ఎంఎల్‌సిలు 23 సార్లు గెలిచిన ఘన చరిత్ర పిడిఎఫ్‌కే సొంతం. ప్రజా ఉద్యమాలలో కీలకంగా వ్యవహరించిన వారే అభ్యర్థులుగా నిలిచి, ఎన్నికలలో గెలిచి శాసన మండలిలో సైతం తమ గళం విన్పించి గత వాణిని వినిపించారు. అదే ఒరవడిని కొనసాగిస్తామంటూ గోపిమూర్తి తాజా ఎన్నికల బరిలో నిలిచారు.

ఆందోళనలు తీవ్రతరం

ఉద్యోగ సంఘాల ఆందోళనలు మిన్నంటుతున్నాయి. కాకినాడలో క్లాప్ డ్రైవర్లు చేపట్టిన ఆందోళనలు 23వ రోజుకు చేరుకున్న విషయం విధితమే. అయితే పాలనా యంత్రాంగం ఇప్పటికీ స్పందించకపోవటం నిర్లక్ష్యాన్ని దర్పణం పడుతోంది. మరోవైపు ఆశా కార్మికులు, విద్యార్థి సంఘాలు తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలకు పిలుపునివ్వటంతో వాతావరణం వేడెక్కింది. మరోవైపు వేతన బకాయిలు కోసం 104 ఉద్యోగులు చేపట్టిన ఆందోళనలు కొనసాగుతున్నాయి. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ 108 ఉద్యోగులు చేపట్టిన ఆందోళనలు పతాక స్థాయికి చేరుకున్నాయి. సమ్మెలోకి సైతం వెళ్లేందుకు సంసిద్ధమవటంతో ఆపద్బాంధవికే ఆపద రానుంది. ఈ నేపథ్యంలో పాలనా యంత్రాంగం చొరవ తీసుకుని ఉద్యోగ సంఘాల సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఉంది. లేని పక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని సుస్పష్టం.

ఉద్యోగులపై సర్వేల ఒత్తిడి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ప్రభుత్వ ఉద్యోగులపై సర్వేల ఒత్తిడి పెరిగింది. దీంతో మానసిక ఆందోళనకు గురవుతున్నామని వారు చెబుతున్నారు. 2019-2024 వరకు ఉన్న వైసిపి ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులను పట్టించుకోలేదన్నారు. సమస్యలను పరిష్కరించలేదన్నారు. నానా రకాల యాప్‌లతో ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం తమను పట్టించుకుంటుందని ఆశపడ్డామని, కాని ఈ ప్రభుత్వంలోనూ సర్వేల పేర ఇబ్బందులకు గురిచేస్తుందని పలువురు ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెనం మీద నుంచి పొయ్యి లోకి పడ్డామా అనే అనుమానం తలెత్తుతుందన్నారు. ఒక సర్వే పూర్తి కాకుండానే మరో సర్వేను ఇస్తున్నారని తెలిపారు. ఏ సర్వే ముందు పూర్తి చేయాలో సతమతమవుతూ తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామని వారంటున్నారు. కొన్ని గ్రామాల్లో నెట్ వర్క సమస్యలు తలెత్తుతున్నాయని, ఫలితంగా జాప్యం జరుగుతుందన్నారు. ఇవేమీ పట్టించుకోకుండా ఉన్నతాధికారులు తమపై ఒత్తిడి తెస్తున్నారని వాపోయారు. ఉదాహరణకు జియో టాగింగ్‌కు పంచాయతీ అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. దీన్ని సచివాలయ ఉద్యోగులతో పాటూ ఎఎన్ఎంలకు కూడా అప్పగించారు. ఆరోగ్యశాఖకు సంబంధించిన పనులు కాకుండా ఇతర శాఖ పనులను అప్పగించడంతో ఎఎన్ఎంలు ఆదోళన చెందుతున్నారు. తమ సమస్యను ఎంపిడిఒలకు మొరపెట్టుకున్నా సర్వే చేయాల్సిందేనంటూ హుకుం జారీ చేయడంతో చేసేది లేక వారు సర్వేబాట పట్టారు. కొన్ని గ్రామాల్లో సర్పంచ్‌ల నుంచి కూడా ఇబ్బందులు వస్తున్నాయని వారు వాపోతున్నారు. న్యుమోనియా సర్వే, జాతీయ నవజాత శిశు వారోత్సవాలు, జియో టాగింగ్, కేన్సర్ సర్వే ఇలా ఏకకాలంలో అనేక సర్వేలు చేయాల్సి రావడంతో ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని తాడిపర్రులో ఇటీవల విద్యుత్ షాక్‌తో మతి చెందిన నలుగురు యువకుల కుటుంబాలకు పశ్చిమగోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం గౌడ సంఘం తరపున ఒక్కో కుటుంబానికి రూ.20వేల చొప్పున ఆర్థిక సాయం అందించామని సంఘం ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ తాత కృష్ణారావు తెలిపారు. నగదును అందజేసేందుకు శనివారం తాడిపర్రు విచ్చేసిన సందర్భంగా కష్ణారావు మాట్లాడారు. మృతుల కుటుంబాలకు అండగా ఉండేందుకు ఆర్థిక సహకారం అందించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యుత్ శాఖ తరపున ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షలు, ప్రభుత్వం నుంచి మరో రూ.5లక్షలు అందించాలన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల గౌడ సంఘాల నుంచి విరాళాలు సేకరించి బాధిత కుటుంబాలకు అందిస్తామన్నారు. గాయపడి కోలుకున్న వ్యక్తికి, మెరుగైన చికిత్స నిమిత్తం రూ.30 వేలు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టా వీరబాబుగౌడ్, తాడేపల్లిగూడెం గౌడ సంఘం అధ్యక్షులు కోట రాంబాబు, ప్రధాన కార్యదర్శి అత్తిలి బాబి, జిల్లా కార్యదర్శి మట్ట రామకృష్ణ, మండల ప్రెసిడెంట్ చిటికెన శ్రీనివాస్, పశ్చిమగోదావరి జిల్లా గౌడ సంఘం యూత్ ప్రెసిడెంట్ చిటికన సూర్యప్రకాష్, తాడిపర్రు ఎంపిటిసి కట్టా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

21, 22 తేదీల్లో జాతీయ స్థాయి వర్కుషాపు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల భౌతికశాస్త్రం, ఎలక్ట్రానిక్స్ విభాగాల ఆధ్వర్యంలో ఈ నెల 21, 22 తేదీల్లో కళాశాలలోని ఫిజిక్స్ డిపార్ట్ మెంట్‌లో మెట్ ల్యాబ్/ ఆక్టావా అంశంపై జాతీయస్థాయి వర్క్ షాప్ నిర్వహించనున్నారు. ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనడానికి డిగ్రీ, పీజి చదువుతున్న విద్యార్థులు, ఆసక్తిగల అధ్యాపకులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. దీనికి డాక్టర్ డి.సంజీవ్‌కుమార్, రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. దీనికి సంబంధించిన ఫ్లైయర్‌ను ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్‌కె.రామచంద్ర, ఫిజిక్స్ విభాగాధిపతి సిహెచ్.కోమలలక్ష్మి శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఫిజిక్స్ విభాగ అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

డిసెంబర్ నెలాఖరుకి 2,333 ఇళ్ల నిర్మాణాలు

ప్రజాశక్తి - రాజానగరం

డిసెంబర్ నెలాఖరుకు 2,333 ఇళ్లను నిర్మాణాలను పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకూ 306 ఇళ్ల నిర్మాణాలు జరిగాయన్నారు. మిగిలినవి త్వరగా పూర్తి చేయాలన్నారు. మండలంలో వెలుగుబంద హౌసింగ్ కాలనీలో ఇన్‌ఛార్జి హౌసింగ్ పీడీ కెఎల్.శివజ్యోతితో కలిసి కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆప్షన్ మూడుగా 3,396 ఇళ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా 683 పూర్తి అయ్యాయన్నారు. 56 పునాది దశలో, 125 బేస్‌మెంట్ దశలో మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. వారం వారం లక్ష్యాలను నిర్ణయించుకుని గ్రూపులుగా లబ్ధిదారులను ఎంపిక చేసి వారి సమస్యలు పరిష్కారం చేయాలన్నారు. లబ్ధిదారుల్లో నాయకత్వ లక్షణాలు ఉన్నవారిని గుర్తించి వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి సమిష్టిగా సమస్యలు పరిష్కారం చేయాలని తెలిపారు. బిల్లుల చెల్లింపు కోసం జియో ట్యాగింగు సమస్య ఉందని, వారికి సరైన విధానంలో దీనిపై అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ వెంట హౌసింగ్ ఎస్ ఇ బివి.గిరి తదితరులున్నారు.

ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌లో గుమ్మలదొడ్డి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గోకవరం

కాకినాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కాంపిటీషన్‌లో గుమ్మళ్లదొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ప్రశాంతి పాల్గొని 30వ స్థానాన్ని కైవసం చేసుకుంది అలాగే పి.లావణ్య ప్రభ, ఐ.సుగుణకు ప్రశంస పత్రాలు దక్కాయి. విద్యార్థులను డ్రాయింగ్ టీచర్ డివివి.శీదేవిని పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పి.సురేష్, హెచ్‌ఎం కె.లక్ష్మీకాంతం, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

గ్రైండర్, కుట్టు మిషన్‌ను అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

'పల్ల వెంకన్న' ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - కడియం

కడియం మండలం కడియపులంకకు చెందిన పల్ల వెంకన్న చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉపయోగార్థం రూ.8 వేల విలువచేసే కుట్టు మిషన్, ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహానికి రూ.10 వేల ఖరీదైన గ్రైండర్‌ను ట్రస్ట్ సభ్యులు శనివారం అందించారు. ఈ కార్యక్రమానికి హెచ్‌ఎం టి.సత్యనారాయణ అధ్యక్షత వహించారు. పల్ల వెంకన్న కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన ట్రస్టు ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. పల్ల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పరీక్ష ఫలితాల్లో దూసుకుపోతున్నాయన్నారు. తామంతా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నామన్నారు. మూడేళ్లుగా మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. పాఠశాల స్టాఫ్ కార్యదర్శి గొల్లపల్లి సత్యనారాయణ, వసతిగృహం వార్డెన్ ఎవివి.వెంకటలక్ష్మి మాట్లాడుతూ తాము అడిగిన వెంటనే కుట్టుమిషన్, గ్రైండర్‌ను బహుకరించిన ట్రస్ట్ అధ్యక్షులు పల్ల వీర వెంకట సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం, గణపతులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పల్ల వెంకటేష్, వినయ్, ఉపాధ్యాయులు రఫీయుద్దీన్, డేవిడ్, శరత్ బాబు, వీరబాబు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యానికి సహకరించాలి

ప్రజాశక్తి-గోకవరం

అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యానికి హెచ్‌ఎంలు, సిబ్బంది, అంగన్‌వాడీలు సహకరించాలని గోకవరం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సునీల్, ఎంఇఒలు గౌరమ్మ, చ్కిరాజుదొర కోరారు. గోకవరం జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పిల్లలుకు హిమోగ్లోబిన్, వివిధ వైద్య పరీక్షలు చేస్తారని సమస్యలు ఉన్నవారు తప్పనిసరిగా తగు చికిత్స పొందాలన్నారు. ఈ కార్యక్రమం కొత్తపల్లి పిహెచ్‌సి పరిధిలో గల అన్ని అంగన్‌వాడీ సెంటర్స్, ప్రభుత్వ స్కూల్స్‌లోనూ ప్రారంభమైందని కొత్తపల్లి పిహెచ్‌సి ఆరోగ్య విస్తరణాధికారి డిఎన్.మూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది, ఎంపిహెచ్ఇఒ ఎస్.శంకర్, హెచ్‌ఎం సత్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రామ్మూర్తినాయుడు మృతికి సంతాపం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్వరాంధ్ర సేవా సంస్థ స్థాపనలో నిర్వహణలోనూ కీలక పాత్ర పోషంచి స్వర్ణాంధ్ర వ్యవస్థాపక అధ్యక్షులుగా 27 ఏళ్లగా కొనసాగిన నారా రామ్మూర్తి నాయుడు మృతికి స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు గుబ్బల రాంబాబు సంతాపం తెలిపారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. స్వరాంధ్ర సేవా సంస్థకు సినీ నటుడు సుమన్ గౌరవ సలహాదారుగా వ్యవహరిస్తే, రామ్మూర్తినాయుడు వ్యవస్థాపక అధ్యక్షునిగా ఉంటూ, సంస్థ చేపట్టిన కార్యక్రమాల్లో స్వయంగా పాల్గొని సహకరించారన్నారు. స్వర్ణాంధ్ర సేవా సంస్థ తొలి సమావేశానికి ఆయన ఎంఎల్ఏ హోదాలో హాజరయ్యారన్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు స్వర్ణాంధ్ర సేవా సంస్థ ప్రాంగణంలో రామ్మూర్తి నాయుడు సంతాప సభ జరపనున్నట్లు ఆయన తెలిపారు.

సమావేశానికి హాజరైన వివిధ పార్టీల ప్రతినిధులు

రాజకీయ పార్టీలతో తహశీల్దార్ సమావేశం

ప్రజాశక్తి - పెరవలి

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ డి.అచ్యుతకుమారి ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో శనివారం సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ ఎంఎల్‌సి గ్రాడ్యుయేట్స్ ఓటుకు 2వేల మంది వరకూ దరఖాస్తు చేసుకున్నారన్నారు. స్క్రూట్నీ నిమిత్తం వీటిని ఆర్‌డిఒ, కలెక్టరేట్‌కు పంపామన్నారు. 23న తుది జాబితా వస్తుందన్నారు. డిసెంబర్ 8వరకూ నూతన ఓటర్లు నమోదు ఉంటుందన్నారు. డిసెంబర్ నెలాఖరు తుది ఓటర్ల జాబితా వస్తుందన్నారు.

సిబ్బంది కొరతతో అందని పౌర సేవలు

ప్రజాశక్తి - సీతానగరం

గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే పూర్తిస్థాయిలో సెక్రటరీలు, సిబ్బంది ఉండాలని రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ శనివారం అసెంబ్లీలో మాట్లాడారు. రాజానగరం నియోజకవర్గంలో ఉద్యోగుల కొరత తీవ్రంగా వేధిస్తోందని తెలిపారు. చాలా గ్రామాల్లో సెక్రటరీలు, విఆర్‌ఒలు, డిజిటల్ అసిస్టెంట్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. దీనివల్ల ప్రజలకు సకాలంలో పౌర సేవలు అందడం లేదని, ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం సెక్రటరీలు, వీఆర్వోలతో పాటు ఇతర సిబ్బంది కొరతను తీర్చేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించినప్పుడే గ్రామ వికాసం కలుగుతుందన్నారు.

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్
(A Government undertaking sponsored by Union Bank of India)
డోర్ నెం. 6-418, అరవింద్ నగర్, మోరంపూడి, రాజమండ్రి రూరల్, తూ॥గో॥జిల్లా

మోరంపూడి శాఖ - బంగారు నగల వేలం ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా మా శాఖలో తీసుకున్న ఋణములు ఎన్ని విధములుగా మీకు సమాచారం పంపినను దిగువ తెలిపినవారు తమ బాకీలను చెల్లించియుండలేదు. ఋణం చెల్లించవలసిన కాలం గడిచినందున ప్రధాన కార్యాలయం వారి ఉత్తర్వుల మేరకు సదరు బంగారు నగలను **ది. 29-11-2024 శుక్రవారం మ॥ గం॥ 3.00లకు** ఈ మోరంపూడి శాఖ ఆవరణలో బహిరంగ వేలం వేసి వారి పేరునున్న బకాయిలు జమ కట్టుకొనుటకు నిర్ణయించడమైనది. వేలములో పాల్గొనదలచినవారు ది. 29-11-2024 మ॥ గం॥ 1.00 లోపు రూ. 5,000/- అడ్వాన్సుగా చెల్లించవలయును. ఎట్టి కారణము చూపకనే వేలమును రద్దు చేయుట గాని, వాయిదా వేయుట గాని బ్యాంక్ వారికి పూర్తి అధికారం కలదు. వేలం వేసిన బకాయిలు రద్దు కాని యెడల వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకొని మిగిలిన బకాయిలు వసూలు చేయబడును. మరియు వేలం తదితర ఖర్చులు వారి ఖాతాలకు వ్రాయబడును. ఈదిగువ పేర్కొనబడిన ఖాతాదారులలో ఎవరైనా మరణించిన యెడల వారి వారసులకు ఈ వేలం వర్తిస్తుంది. నోటీసులు తిరస్కరించిన వారికి పత్రికాముఖంగా చివరిగా తెలియజేయడమైనది.

మోరంపూడి శాఖ, తూర్పుగోదావరి జిల్లా, వేలం తేది: 29-11-2024 సమయం గం॥ 3.00లకు

క్ర.సం.	అప్పు ఖాతా నెం.	ఋణగ్రహీత పేరు, చిరునామా	నికర తూకం గ్రా॥
1.	718030100070608	షేక్ ముంతాజ్ బేగం	39.100
2	718030100077319	గుమ్మిడి నాగమణి	23.800
3	718030100075357	గుమ్మిడి నాగమణి	10.000

మోరంపూడి
17-11-2024
బ్రాంచి మేనేజర్
చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, మోరంపూడి, సెల్: 9100903271

మైనర్‌పై అత్యాచారం

ప్రజాశక్తి - చాగల్లు

మేనమామ వరసైన బంధువు మైనర్‌పై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటన చాగల్లు మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తాడేపల్లిగూడెంకు చెందిన బాలిక నిడదవోలు మండలంలోఒక వసతిగృహంలో ఉంటూ తొమ్మిదో తరగతి చదువుతోంది. తల్లి జీవనోపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉంది. బాలిక బాగోగులు అమ్మమ్మ చూసుకుంటుంది. బాలికకు వరసకు మేనమామ అయిన కమల్ తాడేపల్లిగూడెం మండలంలో ఆటో డ్రైవర్‌గా జీవన సాగిస్తున్నాడు. బాలిక ఆధార్ కార్డు మార్పు చేయాలని దీని నిమిత్తం రూ.100 ఇచ్చి ఈనెల 14న బాలికకు అందించాలని అమ్మమ్మ కమల్‌ను పంపింది. కమల్ హాస్టల్‌కు వెళ్లి బాలికను తన బైకుపై ఎక్కించుకుని చాగల్లు మండలంలో అతని అమ్మమ్మ ఇంటికి తీసుకొచ్చాడు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో కమల్ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం వెళ్లిపోయాడు. అనంతరం బాలికను తాడేపల్లిగూడెంలో అమ్మమ్మ ఇంట్లో దింపేశాడు. తీవ్ర కడుపులో బాధపడడంతో అమ్మమ్మ ఆరా తీసింది. వెంటనే నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రి తరలించగా వైద్యులుచికిత్స అందించారు. విషయం తెలుసుకున్న తండ్రి పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చాగల్లు ఎస్‌ఐ ఎ.నరేంద్ర కేసు నమోదు చేశారు.

ప్రకటన

ది. 15-11-2024 నాడు శ్రీమతి సాగి అమృతవల్లి W/o. సాగి కుమార్ (లేటు) మరియు సాగి సర్వజ్ఞ D/o. సాగి కుమార్ (లేటు) ఎదుర్లంక నుండి విశాఖపట్నం ప్రయాణించుచుండగా, వారికి చెందిన డాక్యుమెంట్లుతో కూడిన బ్యాగ్గు ఒకటి పడిపోయినది. అందులో సాగి కుమార్ గారికి చెందిన (SRO, ఆనందపురంలో రిజిస్టరు కాబడిన) దస్తావేజు నెం. 1216/2015 మరియు దానికి లింకు డాక్యుమెంటు ముదునూరి జయచంద్ర రాజు కి చెందిన (SRO, భీమిలిలో రిజిస్టరు కాబడిన) దస్తావేజు నెం. 1747/2005 మరియు సాగి కుమార్ పేరున ఉన్న (SRO, ద్వారక నగర్‌లో రిజిస్టరు కాబడిన) దస్తావేజు నెం. 2731/2006 పైన ఉదహరించిన మూడు దస్తావేజులు పోయినవి. ఎవరికైనా ఈ దస్తావేజులు దొరికినచో వాటిని వెంటనే 8074256283 కు ఫోన్ చేసి సమాచారం అందజేయగలరు. సదరు దస్తావేజులపై ఇతర వ్యక్తులు ఎవరైనా ఎట్టి లావాదేవీలు జరిపినను మేము బాధ్యులం కాము. పూర్తి హక్కులు సాగి కుమార్ కు వారసులమైన సాగి అమృతవల్లి మరియు సాగి సర్వజ్ఞ లకు మాత్రమే ఉన్నవని తెలియజేయడమైనది.

సాగి అమృత వల్లి మరియు సాగి సర్వజ్ఞ
డోర్ నెం. 2-58A, మెయిన్ రోడ్,
ఎదుర్లంక, ఐ.పోలవరం మండలం
డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా - 533464
ఫోన్: 8074256283

IN THE COURT OF II ADDITIONAL DISTRICT JUDGE: M.M.DISTRICT AT :: MEDCHAL
O.S.No. 5 OF 2024

Between:
Smt. Madhuri Dilip Shahu,
Rep. by her GPA Holder Sri. Subham Sahoo ...Plaintiff
And
Vijay Kumar & others ...Defendants

To,
131. Medisetti Ram Babu S/o. M.Venkata Ramana, R/o. 3-22, Gurajanapalli village, Karapa Mandal, East Godavari District, A.P.
Defendants 131

Please take Notice that my Client Smt. Madhuri Dilip Shahu, W/o. Late. Papalal Sahu @ Devi Singh, Rep. by her GPA Holder Sri. Subham Sahoo has filed the above suit against Vijay Kumar & 175 other Defendants including you on file of the Hon'ble II Additional District Judge, M.M.District, at Medchal vide O.S.No. 5/2024 seeking Partition and separate possession of her half share in respect of the Suit Schedule Property i.e, land admeasuring Ac. 5-35 Guntas or 28,435 Sq. yards in Survey Nos. 206, 207, 208, situated at Mallampet village, the then Quthbulapur Mandal, R.R.District, now comes under Dundigal Municipality, Dundigal- Gandimaisamma Mandal, Medchal-Malkajgiri District which is bounded by North: Dry lands in Survey No. 211, 212, 205, 200, South: Neighbors land, East:Dry lands in Survey No. 198 and East: Dry lands in Survey No.209 along with an Interim Application vide I.A.No.106/2024 filed under Order 39 Rule 1 & 2 R/w Section 151 of CPC seeking grant of Ad-Interim Injunction restraining the Defendants from selling or transferring the Suit Schedule Property to third parties pending disposal of the above suit and the same is posted to 26-11-2024 for your appearance. Inspite of this notice if all of you fail to attend before the above mentioned court on 26-11-2024 at 10.30 A.M, all of you will be set ex-party and the Hon'ble Court will be pleased to pass appropriate orders as per the material available on record.

//BY ORDER OF THE COURT//
D. RAJA AMARESH
Advocate
 # Mulgi No. 14, Maheshwari Chambers, Somajiguda, Hyderabad Cell: 9346921735

పత్రికా ప్రకటన

తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి అర్బన్ బొమ్మూరు గ్రామ కాపురస్తులు **యర్ర సత్తిరాజు** గారి కుమారుడు **యర్ర గంగాధర్** యావన్మంది ప్రజానికానికి తెలియజేయునది ఏమనగా తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం వెలుగుబంద గ్రామ పరిధిలోని జిరాయితీ మెరక సర్వే నెం.**573/2** పూరా ఎ.**6.58** సెంట్ల భూమిలో పడమరవైపు ఉన్న ఎ **5.38** సెంట్ల జిరాయితీ మెరక ఖాళీ నివేశిత స్థలం జలదాని తాతారావు గారి వద్ద నేను పైన తెలిపి భూమికి అగ్రిమెంట్ అయి ఉన్నాను. ఈ భూమి నా స్వాధీన హక్కు భుక్తములలో కలదు. సదరు ఖాళీ స్థలమును ఇతరులు ఈ భూమి మీద నకిలీ డాక్యుమెంట్లు చేయించుకుని ఉన్నారు. ఆ డాక్యుమెంట్లు ద్వారా ఎవరైన కొనుగోలు చేసినచో అవి చెల్లనేరవు నేను తీసుకొనే సివిల్, క్రిమినల్ చర్యలకు భాధ్యులగుదురు.

యర్ర గంగాధర్
సెల్ : 9703428029

IN THE COURT OF THE 9th ADDITIONAL DISTRICT JUDGE (MACT) AT KOVVUR, W.G.DT.
M.V.O.P.No: 50/2024.

Between:
1. Avula Sirisha and others ...Petitioners.
And
1. Sri. Vasamsetti Siva Prasad and others ...Respondents.

Notice to 1st Respondent.

1st Respondent: Vasamsetti Siva Prasad, S/o. Rama Krishna, aged 32 years, Male, Rider of Motor Cycle bearing No. AP 40 AG 3631, R/o. D.No.71-12-8/1, Main Street, Swaroop Nagar, Rajahmundry City and Mandal, E.G.Dt., Rajahmundry PJCJC.

In the above matter you are the 4th Respondents and for your appearance the case was posted to **16-12-2024**. On that day you can appear on your own or through an Advocate before the Hon'Ble court at **10.30** A.M. Hence the case is decreed against you in your absence.

(Order of the Hon'Ble court)
Koduri Narasimha Rao
Advocate
Kovvur, E.G.Dt., A.P.

వేలం ప్రకటన
మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో (సీనియర్ డివిజన్)
ఇ.పి.నెం. 64/2017
ఓయస్.నెం.263/2012

బిట్వీన్:
శ్రీ విజయదుర్గ ఫైనాన్స్, నిడదవోలు, మేనేజింగ్ పార్ట్నర్, రిప్రజెంటెడ్/ఇట్స్ శ్రీ కొణిజేటి వెంకట సుబ్బారావు, తండ్రి బాల కొండయ్య, బిజినెస్, డోరు నెం.7-1-8/1, గణపతి సెంటర్, నిడదవోలు, తూ.గో.జిల్లా
డి.హెచ్.ఆర్/పిటీషనరు/వాది
మరియు
1. గుంటూరు సామ్రాజ్యం(డైడ్)
2. గుంటూరు సత్యన్నారాయణ రెడ్డి, తండ్రి (లేటు) సుబ్బారెడ్డి, పురుషుడు, రిటైర్డ్ ఉద్యోగి, వయస్సు 70 సం॥లు, కుమ్మర్లవీధి, నిడదవోలు (గ్రామము/మండలము)
3. గుంటూరు శ్రీనివాసులు రెడ్డి, తండ్రి సత్యన్నారాయణ రెడ్డి, పురుషుడు, లారీ డ్రైవర్, వయస్సు 45 సం॥లు, కుమ్మర్లవీది, నిడదవోలు (గ్రామము / మండలము.
4. గుంటూరు తిరుమలరెడ్డి, తండ్రి సత్యన్నారాయణ రెడ్డి, పురుషుడు, ప్రైవేటు ఉద్యోగి, వయుస్సు 46 సం॥లు, కుమ్మర్లవీది, నిడదవోలు (గ్రామము/మండలము).
జె.డి.ఆర్.లు/రెస్పాండెంట్లు/ప్రతివాదులు

పై నెంబరు దావా డిక్రి వసూలు నిమిత్తం శ్రీ కోర్టువారి ఆర్డరు ప్రకారము జెడిఆర్‌లు తాలూకు ఈ క్రింది షెడ్యూలు దాఖల స్థిరాస్థిని ది.**19-12-2024**వ సం॥ము తేదీన పై కోర్టు వారి ఎదుట వేలం నిర్వహించబడును. కావున పాడుకొనదలచిన వారు మిగిలి వివరములకు పై కోర్టు నాజర్ గారి వద్ద గాని, డిహెచ్ఆర్ తరుపు అడ్వకేటు గారి వద్ద తెలుసుకొనవలెను.

షెడ్యూల్డు ఆస్తి

గతంలో పశ్చిమ గోదావరి జిల్లా, ప్రస్తుతం తూ॥గో॥జిల్లా నిడదవోలు సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో చేరిన నిడదవోలు మండలము, నిడదవోలు మునిసిపల్ ఏరియా, నిడదవోలు గ్రామము తాలూకు, ఆర్.యస్.నెం.**335** రుకు డోరు నెం. **7-1-8/2**రులో చ.గ.**226** లలో పడమర వైపు చ.గ.**76 1/2** స్థలము అందులో నిర్మించిన గ్రౌండ్ ఫ్లోర్ మరియు మొదటి ఫ్లోర్ డాబా ఇంటికి హద్దులు.

తూర్పు : అ.55లు తెలగారెడ్డి పద్మావతి గారి తనఖా వ్రాయించుకొన్న షెడ్యూలు ఆస్తి
దక్షిణం : అ 12.5లు మల్లవరపు వెంకటేశ్వరరావు గారి స్థలం.
పడమర : అ 55లు తాటి సత్యన్నారాయణ గారి స్థలం,
ఉత్తరం : అ 12.5 లు మునిసిపల్ సిమెంటు రోడ్డు

ఈ హద్దుల మధ్య చ.గ.**76 1/2** స్థలం అందులో నిర్మించిన గ్రౌండ్ ఫ్లోర్ మరియు మొదటి ఫ్లోర్ తలుపులు, కిటికీలు, ద్వారబంధములు, పై కప్పు ఇందలి కరెంటు సర్వీసు ఎక్విప్‌మెంట్, నీటి హక్కులు మరియు లోగడ నుండి రివాజుగా ఉండి ఉన్న సమస్త ఈజుమెంటు హక్కులతో సహా.

డిహెచ్ఆర్ విలువ : రూ. 1,50,000/-లు
అమీనా విలువ : రూ. 40,00,000/-లు

ఎస్.సుబ్బారావు
కొవ్వూరు అడ్వకేటు,కొవ్వూరు
ది.16-11-2024 సెల్.9492917811